# సస్యేందిర

ఋణదాత విశ్వనాథానిది 'దాడిమాగ్రహారం' కాపురస్థలం. "ఉన్నది మనిషికి పుష్టి. తిన్నది పశువుకు పుష్టి" అనే సామెత మనస్సా పెట్టుకుని, పచ్చిమిరపకాయ పుప్పుతో నూరుకు తొట్టునీళ్ల పథ్యంగా చిలుక్కు, ఓముద్ద కారంతో మెక్కి, ఓముద్ద చల్లతో జుర్రి, మిగతాదంతా రొఖ్ఖ నగదుగా ఇనప్పెట్టిలో విలవోసి, విరివిగా వడ్డీవ్యాపారం సాగిస్తూ జీవితం గడుపుతూ వున్నాడతడు. అతని పూర్వీకులు ఆదిలో ఇల్లుకట్టడంలోనే, తమ కులోద్ధారకుల్లో వొకడు డబ్బు జాగ్రత్త పెట్టేవాడు ముందు ముందు వుదయించబోతాడని భావి కనుగుణ్యంగా రెండుతరాల వెనకనే నమోనా ఏర్పాటుచేసుకు కట్టినట్టు అగుపిస్తుంది విశ్వనాథంయొక్క పూరోత్తరపుటిల్లు. గోడల్ది మట్టికాదు; ఉక్కుపోడి!

ఇంటిలోపలకు విరివిగా వెలుతురు చొఱబడదు, గాలీ చొఱబడదు. వీధికలుపులు వేసేస్తె వెలిసెలంట వచ్చిదెంతో అంతే. అందులో ఓ మిద్దెగది వుంది; దానికావెలిసెలూ అగపించవు. ఆ గదిలో పట్టపగలుకూడా ప్రమిదెలో ఆముదం పోసుకు వత్తి ఎగసందోసుకుంటూ దీపం ముందు అస్తమానం తనకు ఇతరులు వ్రాసియిచ్చిన, తిరగ వ్రాసియిచ్చిన, తిరగతిరగ వ్రాసియిచ్చిన ప్రోనోట్లు, తనఖాపత్రాలు, చేవుత్తరాలు, బంగారు వెండి చీటీలు అన్నీ చూసుకుంటూ వడ్డీకి వడ్డీ కట్టుకుంటూ వుండడమే అతని దైనికచర్య. మఱి రాత్రిభాగమందు రూపాయలు, కాసులు, మోహిరీలు మోగించుకుంటూ వుండడమే

రివాజు. ఆ మోగించుకోవడంలోనూ మళ్ళీ గట్టిగా శబ్దిస్తే భయం. అలా బండమీద మోగించి ఆ వెంటనే చప్పుడు చేత్తో నొక్కి ఆపేస్తూ వుంటాడు.

ఆ అగ్రహారంలోవున్న తక్కిన గేస్తులందరియొక్క భూవసతీ విశ్వనాథంకు తనఖా! ఒక్క సెంటు అవలకు పోనీకుండా ఏలాగో మంత్రించి వ్రాయించేసుకున్నాడంటే నమ్మండి!

ఋణబాధవున్నా తక్కిన ఆ యూరివాస్తవ్యుల జీవితంలో ఏదో ఒక రకమైన ఆనందం, లేక ఏదో ఒక అపురూపమైన ఆశయం, లేక ఏదో ఒక విధమైన విలాసం కనిపిస్తుంది. ఒకనికి తన పెరట్లో మంచి సలక్షణంగా పుట్టిన గేదెదూడ ఎంచక్కా నాలుగుకాళ్లూ తెల్లగావుంది, నొష్ట చుక్కవుంది, పృష్ఠభాగాన్ని కలవతోక వుంది. తల్లిగేదె ముందు గంతులువేస్తూ వహ్వా అనిపిస్తుంది. మరొకనికి చేలో బోదెవంచనే గట్టుమీద కంది, పెసర, మినుగూ పెరిగి పూస్తూ కాస్తూ ముచ్చట గొలుపుతుంది. మూడోవానికి భార్య మెళ్లో కాసులపేరు మెరసిపోతూ తేజమిస్తుంది.

ఈలాంటి విశేషాలేమిస్నీ విశ్వనాథం తన భావాంబరాన్ని పొడచూపడానికే అవకాశం కలిగించుకోడు. ఒక్క దబ్బెట్టి ఒక్క పెరుగుముంత కొనుక్కుని, తనూ తన పెళ్లాం తన కొడుకూ తన కూతురూ కడుపుచల్లగా త్రాగ్గా ఇంకా అంతవెన్న కావాలంటాడు ఆ పెరుగు తోరిపితే. మరి దమ్మిడీ నల్ల బంగారానికి వినియోగించిన పాపాన్ని పోలే దత డెప్పుడూ. మరి ఇంకా చెప్పొస్తే—ఇల్లాలికి జుత్తూ, కుత్తుకంటూ ఆ రెండూ వుంటే చాలంటాడు. వట్టి పీనాసి! వో సంగీతం వినికిలేదు, వో సాహిత్యం

తవిఖీ లేదు! అసలు వీధిలోకి తొంగిచూస్తే ఎక్కడేముష్టివాడు డబ్బు అడుగుతాడో అని తొంగిచూడనైనా చూడదు ఎవరన్నా వడ్డీ లెక్క కట్టించుకోడానికి, దాసికి వస్తే వాళ్ళను లోగదిలోకి పిలుచుకునివెళ్ళి అక్కడేం అంకెలు, తిథిద్వయాలు కుదిస్తూ వైష్ణవశేషాలు పొడిగిస్తూ, హెచ్చవేస్తాడో అదే అతని హెచ్చరిక.

విశ్వనాథాన్ని గురించి యింతవరకు చదివిన తరువాత పాఠకులకీసరికి బోధపడివుండాలి మానవమాత్రులు రెండు తెగలు అని—ఒక తెగ అప్పిచ్చేవారు, రెండో తెగ అప్పు తీసుకునేవారు అని. అయితే వీరితోటే మానవకోటి అంతరించలేదు. మూడో తెగ మరొకటి వుంది. వారిపని ఏరోజుకారోజే 'పిట్టను కొట్టు పొయిలోపెట్టు!' నిజంగా అంతే వాళ్ళ బ్రతుకు. వాళ్ళ పొట్టకూటి విధివిధానం పై సామెత కెంతమాత్రం తీసిపోదు. వాళ్ళకు అప్పు పుట్టదు, ఒకళ్ళకు వాళ్లు అప్పు ఇవ్వలేరు. ఆగర్భదరిద్రులు, ఆమరణాంతం దరిద్రులు. అలాంటివాళ్ళను చూసేవుంటారు పాఠకులు చాలామందిని. అలా అని వాళ్ళు నీళ్ళుకారుతూ వుండరు. నీరసంగా వుండరు. బలే ఫైల్మానులుగా వుంటారు. పకపక నవ్వుతూ వుంటారు. గేనాదువ్వి జరీ పాగా పెడతారు. కేరింతాలు కొడతారు. ఊరూరా తిరుగుతూ అతివుత్సాహపూరితు లయ్యేరు. మందే కడుపున కేదోవొకటి దండిగా పడేసుకుంటూ రెండోపూట కప్పుడే వుండీనిబద్ధ పుచ్చుకు మగాడు చెట్లంక చూస్తాడు. ఈతాకు లల్లుకుంటూ ఆడది కళ్లాలొంకకు పోతుంది.

* * * * *

చక్కని ధనుర్మాసపురోజులవి. పొద్దెక్కినకొద్దీ చలితగ్గి మంచువిడి, పంటవలంతి వెల్లడిగా హాయిగా అగపించే కాలమది. అగ్రహారంలో ఆటాడ్డానిగ్గాను దొమ్మరి కుటుంబం వొకటి ఆడది మగాడూ పిల్లలూ వృద్ధులూ చేలగట్లంట నడచివచ్చి ఊళ్లో ప్రవేశించారు. వారి ప్రవేశదృశ్యం చూచినవాళ్ళు అరుదు. కాని అపరాహ్ణానికి గ్రామస్థులయొక్క పేరూ ప్రతిష్ఠా. మంచీ చెడ్డా. వాడికా వాసీ తెలిసికొన్నవాళ్ళయి ఆ దొమ్మరివాళ్ళు తగుచోట నడువీధిలో డోలుమీద దెబ్బకొట్టి కేకేసేసరికి వెయ్యిమంది పోగయ్యారు. రయితులు, రయితుల భార్యలు, రయితుల పిల్లలు, రయితుల పాలేళ్ళు—వొకళ్ళేమిటి అష్టాదశ వర్ణాలవాళ్ళు పొలాల్లోంచీ, యిళ్ళల్లోంచీ వచ్చి యావన్మందీ అరుగులమీద, అరుగుల పంచ బారులుతీరి కూర్చుని "ఆటెప్పుడు ప్రారంభిస్తారా, ఎప్పుడు చూద్దామా" అని కనిపెట్టుకు వున్నారు.

ఒక ఘట్టిబొట్టెడు పిల్లిమంతరంవేసి రానట్టు తభీమని చాపకట్టుగా జారేసరికి పకపకా అంతా నవ్వారు. మళ్ళీ వాడే సరిగ్గా వాలుమొగ్గవేసి లేచి నిటాగ్గా నిలబడేతలికి 'అజ్జారే! ఎంత విడ్డూరపు మొగ్గవేశాడు! కాస్తున్నాడో లేదో!' అని విస్తుపోయినారు. గండరగండ డొకడు గుభేల్ గుభేల్ దండ సఱచుకొని చడ్డీమువ్వలు చప్పుడు చేసుకుంటూ కత్తిసాముగా తిప్పేసరికి జనంలో నూటొక్కమంది వత్తిగిలి వారిగిపోయినారు. చూస్తూవున్న స్త్రీలు 'కత్తి వానివొంటికి తగిల్తే నెత్తురు కాటిపోదూ' అని బుగ్గమీద వేలేసుకున్నారు. ముసీలివాడొకడు చిన్న దొమ్మరివానితో వేళాకోళమాడుతూ అదెక్కటందుకుగాను పెద్ద పొడుగుపాటి గడకఱ్ఱ పాత్తూవుంటే ప్రేక్షకప్రజ యావత్తూ

'ఎంతెత్తు వెదురో! దానిచివర కెక్కి ఆ పిల్ల ఆడ్డమే! గిరగిర తిరగడమే!' అని అవకాశంలోకి చూపులు విసిరేశారు.

చిన్న దొమ్మరిసాని గడెక్కి ఆదేముందు అది గరిడీస్థలం చుట్టి తిరుగుతూ ఉపన్యసింప దొడగింది. ఆమె వాక్యాల వెంబడి దాని మగడు డోలు బజాయిస్తున్నాడు తాళమానంగా —

"బాబులూ! నేను మీవూరి దొరసాన్ని కాను—ఢంఢం. "కాని మీవూళ్లో గడెక్కి అందరికంటె ఎత్తుగా ఆడుతున్నా మన్నించండి—ఢంఢం. "మహారాజులూ! నాకు భూమీ, పుట్రా లేదు—ఢంఢం. "కాని మీ వూరి పాడీ పంటా అంతా నాదే; మన్నించండి —ఢంఢం. "తల్లులూ! నాకు వెండి బంగారాలు హుళక్కి—ఢంఢం. "కాని మీమహాలక్ష్మి విద్యల్లు నా కాళ్ల గజ్జెల్లు మన్నించండి"—ఢంఢం.

ఆలా అంటూ గడెక్కింది దొమ్మరిసాని.

గడచివర సూదిమొనకు పోకముడి గ్రుచ్చి అందుమీద బొడ్డు మోపికొన్నదై —"వహ్వా! వహ్వా! వారేవారే!" అని క్రిందనుంచి తనవాళ్ళంతా డోలుబజాయిస్తూ హెచ్చరిస్తూవుంటే- అతి సుందరంగా మహావలయాకారంగా గిర్రున తిరిగిపోతూవుంది ఆ కుఱ్ఱది. తన రెండుకాళ్ళూ, రెండు చేతులూ అంతరాళమందు సాచేసేసింది. 'బార్' ఒకానొక తురితానికి వచ్చేటప్పటికి ఆ దొమ్మరి బొమ్మక్క యథేచ్ఛగా రివటలా ఆడిపోతూ అవ్యక్త మధురాతిమధురమయనాదం విసురుతూ పాడదొడగింది.

"పొలిమేర యావలి పొలాలె చూస్తు
పొలాల అంచే పొద్దే చూస్తు"

* * * * *

తన అగ్రహారంలో అంత జనసంకులంగా, అంత చమత్కారంగా దొమ్మరి ఆట జరుగుతూవున్న పైసమయంలో ఋణదాత విశ్వనాథం ఏం చేస్తూవున్నాడు? పిల్లల్నీ పెళ్లాన్నీ యింట్లోంచి కదల్నివకుండా వీధితలుపు బంద్‌చేసి తానొక్కడూ లోపలి గదిలో—అనగా చీకటి కొట్టుకోణంలో కూర్చున్నవాడై, ఆదాకా అరటిచెట్ల నోట్లు లెక్కపెట్టి లెక్కపెట్టి పదిపదిగా కట్టలుకట్టి ఒక ఆవలింత ఆవలించి, ఏదో కాలదోష సమీపపత్రం తీసి దాని డోకడాలు లెక్కిస్తూ, అధికమాసాలు కలిపి వడ్డీకట్టి నాటితిథి అమావాస్యవెళ్లగా పాడ్యమివో, చతుర్దశి వెళ్లను అమావాస్యవో బాగా తెలుసుకోగలందులకు ఒక పంచాంగం తీసి చూచి తనివి చెందక మరో పంచాంగం విప్పుతూవున్నాడు. విప్పుతూ విప్పుతూ ఏదో తన చెవులకు ఆలకింపుగాతట్టి భార్యను పిలచేడు "ఒసేవ్" అని. భార్య వచ్చి "ఏదో పాటలావుందండీ!" అంది. దోరెట్టుకు వింటూ విశ్వనాథం "పాటేలే! మన తనఖాకు లోబడేనా ఆపాట? బాగా విను" అన్నాడు.

"కాదండీ! దొమ్మరివాళ్ల ఆటల్లే వుందండీ! కోర్టువారి వేలంపాట డప్పు కానట్టుందండీ! దొమ్మరివాళ్ల డోలల్లే వుందండి" అంది భార్య.

"ఆఁ" అంటూ మిద్దె దద్దళంవంకకు చూచేడు విశ్వనాథం.

దద్దళంమీద చప్పుడవుతూవుంది. "ఏమిటే ఆ చప్పుడు?" అన్నాడు భార్యతో విశ్వనాథం. అప్పటికప్పుడే ఎప్పట్నుంచో దద్దళంమీది కెక్కి చూరు వెలిసెల్లోంచి చూస్తూవున్న విశ్వనాథం కొడుకూ, కూతురూ—ఆ కుర్రకుంక లిద్దరూ తండ్రి ప్రశ్నకు

ఏకస్వరంతో ముక్తకంఠులై జవాబిస్తూవున్నారు: "మేంనాన్నా! వీధిలోకి వెళ్లకుండానే చూరు వెలిసెల్లోంచి ఊరికే చూస్తూ వున్నాము నాన్నా! దొమ్మరివాళ్ల ఆటనాన్నా! దొమ్మరిసాని గడెక్కి ఎంచక్కా ఆడుతూవుంది నాన్నా! బలేగా తిరుగుతూ వుంది నాన్నా!" అన్నారు. అంటూ ఇంటిచూరు కొంచెం చెయ్యెట్టి వొత్తిగించేరు.

చూరు మిక్కిలీ పాతచూరు కావడంచేతా, వెదురుబద్ద పుచ్చిపుచ్చి వుండడంచేతా, మళ్ళీ పెంకు తిరగవెయ్యబడ్డది కాకపోవడంచేతా చేటంతామేర పెణక పైకి లేచిపోయింది. విశ్వనాధంయొక్క నట్టింటికంతకూ కొత్తకాంతి వచ్చింది.

దొమ్మరిసాని ఆటయి ఊళ్లో ఇంటింటా ఆడుక్కుంటూ విశ్వనాధం యింటిముంగిటా నిల్చింది. "బాబులూ! విశ్వనాధం బాబులూ! తలుపు తీయించండి ప్రభూ! మీరుపట్టిన తనఖా లన్నింటికీ పైతనఖా బాబూ మాది! మా తవ్వెడుబియ్యం డబ్బూ మాకిప్పించండి బాబూ!" అని తలుపు తట్టింది.

విశ్వనాధంభార్య "ఏమండీ! తలుపు తియ్యనా? దానికి బియ్యం పెట్టనా? డబ్బు ఇవ్వనా?" అంది.

విశ్వనాధం "తియ్యి! పెట్టు! ఇవ్వు! ఏంచేస్తావు? కుట్టుకుంకలు పెణక విరగ్గొట్టుకుమరీ దానికళ్ళ బడ్డారు. అది తలుపు బ్రద్దలుకొట్టుకు మరీ కొల్లగొట్టుకు పోయేటట్టుంది. తియ్యి! పెట్టు! ఇవ్వు!" అన్నాడు.

తమతల్లి దొమ్మరిసాన్ని బహూకరించబోతూవుందని తెలిసి అటకమీది పిల్లకాయలిద్దరూ సావిట్లోకి దిగారు. తల్లి

తలుపుతీస్తూవుంటే తల్లిని చుట్టేసి అంటూవున్నారు: "మరికొంచెం బియ్యం పెట్టే దానికి. దానికళ్ళల్లో పొలిమేరదాకా ఉన్న భూములు మెలిసిపోయినాయే గడెక్కి ఆడుతూవుంటే" అన్నాడు కొడుకు.

విశ్వనాథం "వెధవా! పొలిమేరదాకావున్న భూములు మనకు పూరంతా వ్రాసియిచ్చిన తనఖాపత్రాల షెడ్యూళ్ళల్లో కనిపించవు? దాని కళ్ళల్లో కళ్లెట్టుకు చూడాలి? అందుకోసం మరికొన్ని బియ్యం పెట్టాలి?" అని కసిరాడు లోపలిగదిలోంచే. కూతురు అంటూవుంది: "కాదు నాన్నా! ఉత్తి పొలాలు కావు నాన్నా అవి. నీరెండకాంతి సమేతమైన పొలాలు నాన్నా అవి. ఆ నీరెండ మన పత్రాల్లో కనిపించదు నాన్నా! పెట్టే అమ్మా! మరికొంచెం బియ్యంతోపాటు మతోదబ్బుకూడా ఇయ్యవే!" అంది.

విశ్వనాథం: "నీరెండ! దానికళ్ళల్లో నీరెండ!" అంటూ గదిలోంచి యివలకు తొంగిచూచాడు. దొమ్మరిజాణ తన సావిట్లోకి వచ్చి తన భార్యా చేతినుండి ధర్మం బలిదానంలా పరిగ్రహిస్తూవుంటే విశ్వనాథం తన చీకటి కొట్టులోంచి యివలకు తొంగిచూచాడు.

దొమ్మరి చిన్నది పసుపుపచ్చని లంగామీద గులాబిరంగు వోణీవేసుకు, ఆకుపచ్చని రుమాలు వొకటి మేలిముసుగ్గా సవరించుకొంటూ ఓరచూపుల చేరెడేసి కళ్లెట్టుకు విశ్వనాథానికి కనిపించింది. విశ్వనాథం నివ్వెఱపోయి "దొమ్మరిసాని కాదది. సన్యేందిర! మతో తవ్వెడు బియ్యం, మతోదబ్బు ఇయ్యి" అన్నాడు భార్యతో.

భర్త అనుజ్ఞ ననుసరించి యిచ్చి ఆటకత్తెను సాగనంపి యిల్లాలు తన మగనితో అంటూవుంది: "ఎక్కణ్ణుంచి వచ్చిం దండీ ఇంత వితరణం ఈవేళ మీకు?" అని అడిగింది. "మీ తథాకాకు దాంది పైతథాకా అందనా? లేక నాకంటె అది ఎక్కువ అందంగా వుందనా? ఎక్కణ్ణుంచి వచ్చిందండీ ఇంత వితరణం ఈవేళ మీకు?" అని రెట్టించింది.

విశ్వనాథం భార్యకు ప్రత్యుత్తరం ఇయ్యకుండా ఒకానొక నూతన వికాసంలో భాసమానుడౌతూ సన్యేందిర! సన్యేందిర:" అని పునశ్చరణ గావించి తన్మయుడైనాడు.

## వినాయకుడి సంబరం

ఎక్కడైతే చెట్టుందో ఆ పట్నంలో అక్కడల్లా నీడ. ఎక్కడైతే నీడ వుందో ఆ పట్నంలో అక్కడల్లా నిలువ నీడలేని బిచ్చగాండ్లు, బిచ్చకత్తెలూ. లక్షాధికార్లైనా తమతమ సిమెంటు భవనాలు ఏ భూకంపానికో, ఏ తుపాను విసురుకో పడిపోతాయి అనే భయం కలవాళ్ళయి యుండవచ్చుగాని, ఆ బిచ్చగాండ్లకు బిచ్చకత్తెలకు ఎప్పుడూ ఏభయమూలేదు. చెట్లను పాతినవాళ్లుకారు వారు. చెట్లుకు నీరుపోసి పెంచినవాళ్లూ కారు. ఆచెట్లకూ ఆబిచ్చగాండ్లకూ బిచ్చ కత్తెలకూ అవినాభావసంబంధం ఏలా ఏర్పడిందో? అడక్కుండా పువ్వునుపడేస్తాయి అపేక్షించకుండా మలయమారుతాన్ని వీస్తాయి. కాని ఆ బిచ్చగాండ్లకూ బిచ్చకత్తెలకూ ఎంతమాత్రం ఆకలి తీర్చే చెట్లుకావవి. అవి అన్నీ దిరిసెన చెట్లు. పువ్వు లతిమెత్తన, నీడ